క్లుప్తంగా

నల్లాలు బిగించారు



నల్లా కనెక్షన్ ఏర్పాటు చేస్తున్న కార్మికుడు

సాక్షి ఎఫెక్ట్..

మందమర్రిరూరల్: గత నెల 28న 'సాక్షి' దినపత్రికలో 'నల్లా కనెక్షన్ ఇప్పించండి సారూ' అనే వార్తా కథనానికి మున్సిపల్ అధికారులు స్పందించారు. పట్టణంలోని రెండో జోన్ రైల్వేస్టేషన్ రోడ్డులో గల ప్రభుత్వ పాఠశాల ఎదుట కాలనీ వాసులకు మిషన్ భగీరథ నల్లాల కనెక్షన్ ఇప్పించడానికి గురువారం పనులు ప్రారంభించారు. సమస్య పరిష్కారానికి కృషి చేసిన 'సాక్షి' కి కృతజ్ఞతలు తెలియజేశారు.

'ఎమ్మెల్యే కృషితోనే అభివృద్ధి'

తాండూర్: బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ కృషితో తాండూర్ మండలం అభివృద్ధి శరవేగంగా జరుగుతోందని డీసీసీ ఉపాధ్యక్షుడు సూరం దామోదర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ సల్వాజీ మహేందర్‌రావు నివాసంలో గురువారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యే వినోద్ స్థానికంగా నివాసం ఉండటం లేదని, ప్రజా సమస్యలను పట్టించుకోవడం లేదని మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య విమర్శలు చేయడం అర్థరహితమన్నారు. వినోద్ ప్రత్యేక శ్రద్ధ తీసుకోవడం వల్లనే తాండూర్ మండలంలో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని వివరించారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఎస్.మహేందర్‌రావు, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ గట్టు మురళీధర్‌రావు, మాజీ జెడ్పీటీసీ సాలిగామ బానయ్య, యువజన నాయకుడు గణపతి, అంజీ పాల్గొన్నారు.

టీపీఏ డైరీ ఆవిష్కరణ



టీపీఏ డైరీని ఆవిష్కరిస్తున్న కలెక్టర్ కుమార్‌దీపక్

మంచిర్యాలటౌన్/మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ సైకాలజిస్ట్స్ అసోసియేషన్(టీపీఏ) నూతన క్యాలెండర్, డైరీని జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్ కుమార్‌దీపక్ చేతుల మీదుగా గురువారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో టీపీఏ జిల్లా అధ్యక్షుడు వేణు కుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షులు నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సుమన చైతన్య, వైస్ ప్రెసిడెంట్ రజిత, గౌరవ సలహాదారు యోగేశ్వర్, సృజన మోహన్, కవిత, నాగరాజు పాల్గొన్నారు.

బీసీలు ఐక్యత చాటాలి

దండేపల్లి: హక్కుల సాధనకు బీసీలు ఐక్యతను చాటాలని బీసీ రాజ్యాధికార సమితి మంచిర్యాల జిల్లా కన్వీనర్ ఒడ్డెపల్లి మనోహర్ అన్నారు. ఈ నెల 12న మంచిర్యాల శ్రీహర్ష డిగ్రీ కళాశాలలో నిర్వహించే బీసీ రాజ్యాధికార సమితి జిల్లా సమావేశం గురించి దండేపల్లిలో బీసీ సంఘ నాయకులతో గురువారం సమావేశమై చర్చించారు. సమావేశానికి బీసీ సంఘాల నాయకులు అధిక సంఖ్యలో హాజరవ్వాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు రవీందర్, చంద్రకాంత్, రాజన్న, రాజగురువయ్య, మండల నాయకులు వొడ్నాల శంకర్, చీర్ల వెంకటేష్, స్వర్గం శంకరయ్య, కడారి బుచ్చన్న, తాళ్ల కుమారస్వామి, బుర్ర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

టైగర్‌జోన్‌లో ఇసుకపై ఆంక్షలు ఎత్తివేయాలి

జన్నారం: టైగర్‌జోన్‌లో ఇసుకపై పెట్టిన ఆంక్షల వల్ల స్థానిక ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారని, అటవీశాఖ అధికారులు ఆంక్షలు ఎత్తివేయాలని జాగృతి సేనా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మామిడి విజయ్ డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో గురువారం ఆయన మాట్లాడుతూ.. గృహ అవసరాలకు ఇసుకను తీసుకెళ్తే అటవీశాఖ అధికారులు కేసులు పెడుతున్నారని, జరిమానాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. గ్రామాల పరిధిలో గృహ అవసరాలకు రెవెన్యూ అధికారులు బాధ్యత తీసుకొని ఆంక్షలు లేకుండా ఇసుకను తీసుకెళ్లేలా అనుమతిచ్చేలా చూడాలని కోరారు. సమావేశంలో కిటేశ్, రాములు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

భీమదేవర జెండా పండుగ



జెండాలతో గిరిజనులు

వేమనపల్లి: మండలంలోని గొర్లపల్లి, కాటేపల్లి గ్రామాల్లో మన్నేవార్(కొలవార్) సేవా సంఘం ఆధ్వర్యంలో గిరిజనులు భీమదేవర జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. మండల ఆదివాసీ నాయకులు గురువారం జెండా ఆవిష్కరించారు. ఆదివాసులంతా ఏకమై హక్కుల కోసం పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పెద్ద ఎత్తున ఆదివాసీ మహిళలు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

అమృత్ నీరందేనా..!

- నత్తనడకన నిర్మాణ పనులు
- పనుల ప్రదేశంలో సూచికబోర్డులు కరువు



ఏడో వార్డులో కొనసాగుతున్న వాటర్‌ట్యాంకు నిర్మాణ పనులు

లక్సెట్టిపేట: తాగునీటికి నల్లా కనెక్షన్‌లు లేని ఇళ్ల కోసం నూతనంగా నల్లాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ప్రవేశపెట్టిన అమృత్ తాగునీటి నిర్మాణ పనులు నత్తనడకన సాగుతున్నాయి. రూ.20కోట్లు మంజూరు కాగా మున్సిపాలిటీ పరిధిలోని లక్సెట్టిపేట, ఊత్కూరు, మోదెల, ఇటిక్యాల వార్డులలో పనుల కోసం గతేడాది జూన్ మాసంలో టెండరు ప్రకటించినా, కొన్ని ప్రదేశాల్లో పనులు ఇంకా ప్రారంభించలేదు. ఆదిలోనే జాప్యం జరుగుతుండడంతో ముందుకు సాగుతాయా లేదా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. ఈ పథకం బాధ్యతలు ప్రజా ఆరోగ్య శాఖ అధికారులకు అప్పగించగా, అసలు పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. లక్సెట్టిపేట తహసీల్దార్ కార్యాలయం వెనుక ఇప్పటికీ పనులు ప్రారంభించలేదు. ఊత్కూరులోని ఏడో వార్డులో ట్యాంకు నిర్మాణ పనులు పిల్లర్ల దశంలో ఉన్నాయి. సత్యసాయినగర్ ఒకటో వార్డులో పిల్లర్ల కోసం గుంత మాత్రమే తవ్వారు.

ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులు..

ఊత్కూరులోని ఏడో వార్డులో నిర్వహించే వాటర్ ట్యాంకు నిర్మాణ పనులను ఇష్టారాజ్యంగా నిర్వహిస్తున్నారు. పనులు నిర్వహించే ప్రదేశంలో ఎలాంటి సూచిక బోర్డులు, రక్షణ ఇనుప కంచెలు, సెక్యూరిటీ లేకుండా ఇష్టారాజ్యంగా నిర్మాణ పనులు చేపడుతున్నారు. రెండు రోజుల క్రితం సెంట్రింగ్ పని చేసే వ్యక్తి అదుపుతప్పి పడడంతో కాలుకు గాయాలైనట్లు, హైదరాబాద్‌కు తరలించినట్లు తెలిసింది. సంబంధిత అధికారులు పని ప్రదేశాన్ని విజిట్ చేయడం లేదని ఆరోపణలు వస్తున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకొని గడువులోగా పనులు చేసేలా చూడాలని పలువురు కోరుతున్నారు.

గడువులోగా పూర్తి చేస్తాం

నిర్మాణ పనులు జూన్ మాసంలో ప్రారంభించాల్సి ఉండగా, ఆలస్యమైంది. టెండరు ప్రక్రియ మాత్రం పూర్తి అయింది. ఊత్కూరులో పనులు పిల్లర్ల దశకు చేరుకున్నాయి. మిగితా ప్రదేశాల్లో పనులు ప్రారంభిస్తున్నాం. నిర్మాణ ప్రదేశంలో రక్షణ చర్యలు తీసుకుని, గడువులోగా పనులు పూర్తి చేస్తాం.

– మధుకర్, ప్రజాఆరోగ్యశాఖ డీఈ

బీజేపీ నూతన మండలాధ్యక్షుల ఎంపిక



మండలాధ్యక్షులను ప్రకటిస్తున్న లింగారెడ్డి

మంచిర్యాలటౌన్: బీజేపీ నూతన మండలాధ్యక్షులను గురువారం ఆ పార్టీ జిల్లా సంస్థాగత ఎన్నికల ఇన్‌చార్జి బద్దం లింగారెడ్డి మంచిర్యాల పట్టణంలోని బీజేపీ కార్యాలయంలో ప్రకటించారు. జాతీయ పార్టీ పిలుపు మేరకు దేశవ్యాప్తంగా నాలుగు నెలల నుంచి బీజేపీ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని పూర్తి చేసుకొని బూత్ స్థాయిలో బూత్ కమిటీలను నియమించి, జిల్లాలోని 14మండలాలకు నూతన మండల అధ్యక్షులను ప్రకటించినట్లు లింగారెడ్డి తెలిపారు. మిగిలిన మండలాల అధ్యక్షులను త్వరలోనే ప్రకటించి, బీజేపీని స్థానిక ఎన్నికల్లోపు బలోపేతం చేసే దిశగా కృషి చేయాలని నూతన అధ్యక్షులకు పిలుపునిచ్చారు.

బీజేపీ మండలాధ్యక్షులు వీరే..

మంచిర్యాల పట్టణం–అమిరిశెట్టి రాజు, నస్పూర్–ఆత్రం రమేశ్, హాజీపూర్–గడ్డం స్వామి రెడ్డి, లక్సెట్టిపేట మున్సిపాలిటీ–వీరమల్లు హరిగోపాల్, లక్సెట్టిపేట మండలం–నాగిరెడ్డి హేమంత్‌రెడ్డి, బెల్లంపల్లి పట్టణం–దార కళ్యాణి, తాండూర్–దూడపాక భారత్, నెన్నెల–అంగలి శేఖర్, భీమిని–కొంక సత్యనారాయణ, వేమనపల్లి–ఏట మధుకర్, చెన్నూరురూరల్–బూర రాజశేఖర్, భీమారం–బోరకుంట శంకర్, క్యాతన్‌పల్లి మున్సిపాలిటీ–ఠాకూర్ ధన్‌సింగ్, మందమర్రి రూరల్–గిరినాటి జనార్దన్‌లను నియమించినట్లు తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శులు రజనీశ్ జైన్, దుర్గం అశోక్, పెద్దపల్లి పురుషోత్తం, వంగపల్లి వెంకటేశ్వర్‌రావు, ఎనగందుల కృష్ణమూర్తి, కృష్ణ దేవరాయలు, కాశెట్టి నాగేశ్వర్‌రావు, పల్లి రాకేశ్, మహీధర్ గౌడ్, కుర్రె చక్రి పాల్గొన్నారు.

విద్యుత్ కనెక్షన్ల పునరుద్ధరణకు కృషి

బెల్లంపల్లి: బెల్లంపల్లి మున్సిపాలిటీలోని కన్నాల బస్తీ, టేకుల బస్తీల్లో కంపెనీ క్వార్టర్లకు తొలగించిన విద్యుత్ కనెక్షన్‌లను వెంటనే పునరుద్ధరించడానికి ఎమ్మెల్యే గడ్డం వినోద్ చర్యలు తీసుకున్నారని మున్సిపల్ చైర్‌పర్సన్ జక్కుల శ్వేత, మాజీ చైర్మన్ మత్తమారి సూరిబాబు, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు ముచ్చర్ల మల్లయ్య, కాంగ్రెస్ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యుడు నాతరి స్వామి సంయుక్త ప్రకటనలో తెలిపారు. ఆకస్మికంగా విద్యుత్ కనెక్షన్‌లు తొలగించడం వల్ల కార్మికులు, రిటైర్డు కార్మికులు ఇబ్బంది పడుతున్న దృష్ట్యా ఎమ్మెల్యే గడ్డం వినోద్ స్పందించి సింగరేణి చైర్మన్‌తో చర్చించారని తెలిపారు. వచ్చే మార్చి 31వరకు కంపెనీ క్వార్టర్లకు సింగరేణి విద్యుత్ సరఫరా చేయాలని సీఅండ్‌ఎండీని ఎమ్మెల్యే కోరారని, ఇందుకు సింగరేణి చైర్మన్ అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు కాంగ్రెస్ నాయకులు తెలిపారు.

జన్నారంలో డీపీవో పర్యటన



తపాలపూర్‌లో నర్సరీ పరిశీలిస్తున్న డీపీవో

జన్నారం: మండలంలోని తపాలపూర్, ఇందన్‌పల్లి గ్రామపంచాయతీలను మంచిర్యాల జిల్లా పంచాయతీ అధికారి(డీపీవో) వెంకటేశ్వర్‌రావు గురువారం సందర్శించారు. గ్రామపంచాయతీల్లో శానిటేషన్, కంపోస్ట్, వైకుంఠధామం, నర్సరీ, వాటర్ సప్లాయ్ నిర్వహణల్లో తగు సూచనలు చేశారు. గ్రామపంచాయతీ ట్రాక్టర్ల ద్వారా ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్త, ప్లాస్టిక్ సేకరణ వంటి విషయంలో సక్రమంగా చేపట్టాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో జలంధర్, తపాల్‌పూర్ పంచాయతీ కార్యదర్శి రమేశ్, ఇందన్‌పల్లి కార్యదర్శి చంద్రమౌళి, గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

భూములు తిరిగి ఇవ్వాలని రైతుల డిమాండ్



పట్టాలు చూపుతున్న బాధిత రైతులు

భీమారం: మండల కేంద్రంలోని 138సర్వే నంబర్‌లో గల ప్రభుత్వ భూములను తిరిగివ్వాలని రైతులు డిమాండ్ చేశారు. 40ఏళ్ల క్రితం వెట్టిచాకిరి విముక్తిపథకం ద్వారా ప్రభుత్వం ఒక్కొక్కరైతుకు ఎకరం చొప్పున భూమిని ఇచ్చిందన్నారు. దాంట్లో తాము వ్యవసాయం చేసుకుంటున్నామని తెలిపారు. అయితే గత ప్రభుత్వం హయాంలో ప్రకృతివనంతో పాటు పలు నిర్మాణాల కోసం తమ భూమిని బలవంతంగా తీసుకుందన్నారు. దీంతో తాము దిక్కుతోచని స్థితిలో పడ్డామని వాపోయారు. ప్రభుత్వం స్వాధీనపర్చుకున్న భూములు తిరిగి ఇవ్వాలని తాము అనేక సార్లు ప్రభుత్వానికి వినతిపత్రాలు ఇచ్చినా ఏమాత్రం స్పందించడం లేదని ఆరోపించారు. ఇప్పటికైనా కలెక్టర్ చర్యలు తీసుకొని భూములు ఇప్పించాలని బాధిత రైతులు కోరుతున్నారు.

సమాచారం

పీజీ మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించండి

బెల్లంపల్లి: బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీజీ చదువుతున్న విద్యార్థులు మొదటి సెమిస్టర్ పరీక్ష ఫీజు చెల్లించాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ కాంపల్లి శంకర్ ఒక ప్రకటనలో తెలిపారు. మొదటి సెమిస్టర్ చదువుతున్న ఎంకాం, ఎంఏ ఇంగ్లీష్, ఎంఏ పొలిటికల్ సైన్స్ విద్యార్థులు ఈ నెల 18వ తేదీలోగా చెల్లించాలని పేర్కొన్నారు. పరీక్ష ఫీజుతో పాటు యూనివర్సిటీ రిజిస్ట్రేషన్, ప్రాసెసింగ్, స్టూడెంట్ రికగ్నైజేషన్, స్టూడెంట్ వెల్ఫేర్ ఫండ్, ఇంటర్‌యూనివర్సిటీ ఫీజు కళాశాలలో ఆన్‌లైన్ ద్వారా చెల్లించాల్సి ఉంటుందని వివరించారు. ఇతర వివరాల కోసం డిగ్రీ కళాశాలలో పీజీ కో ఆర్డినేటర్ రఫీని సంప్రదించాలని కోరారు.

ఎత్తిపోతల నీటి సరఫరా పునరుద్ధరణ

దండేపల్లి: మండలంలోని గూడెం సత్యనారాయణస్వామి ఎత్తిపోతల పథకం హెచ్‌టీ ప్యానెల్‌లో తలెత్తిన సమస్యను గురువారం పరిష్కరించారు. కొద్ది గంటలపాటు నిలిచిన సాగునీటి సరఫరాను సాయంత్రం నుంచి పునరుద్ధరించినట్లు ఇరిగేషన్ అధికారులు తెలిపారు. ప్రస్తుతం ఒక మోటార్ ఆన్ చేసి నీటి సరఫరా కొనసాగిస్తున్నారు. రెండో మోటారును శుక్రవారం ఉదయం ఆన్ చేస్తామని అధికారులు పేర్కొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కాసిపేట: మండల కేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్ హాస్టల్‌లో ఒప్పంద ప్రాతిపదికనా కేర్ టేకర్‌గా పనిచేయుటకు అర్హుల నుంచి దరఖాస్తు కోరుతున్నట్లు మండల విద్యాధికారి వెంకటేశ్వరస్వామి తెలిపారు. డిగ్రీతో పాటు బీఎడ్ లేదా డీఎడ్ చేసిన వారు అర్హులన్నారు. కాసిపేట మండలానికి చెందిన స్థానిక మహిళ, 25 నుంచి 40సంవత్సరాల వయసు ఉండాలని సూచించారు. అనుభవం ఉన్న వారికి ప్రాధాన్యం ఇవ్వనున్నట్లు తెలిపారు. అభ్యర్థుల ఎంపిక మెరిట్ ఆధారంగా నిర్ణయించనున్నట్లు పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థులు 13లోగా మండల విద్యావనరుల కేంద్రంలో ధృవపత్రాలతో దరఖాస్తులు సమర్పించాల్సిందిగా కోరారు.

విదేశీ ఉద్యోగవకాశాల కోసం...

మంచిర్యాలఅగ్రికల్చర్: తెలంగాణ ఓవర్సీస్ మ్యాన్ పవర్ కంపెనీ లిమిటెడ్ (టామ్‌కామ్)తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్మిక, ఉపాధి శిక్షణ, ఫ్యాక్టరీల శాఖకు చెందిన ప్రభుత్వ ఆమోదిత నియామక సంస్థ ఆధ్వర్యంలో నైపుణ్యం కలిగిన బస్ డ్రైవర్లకు జర్మనీలో పనిచేసే ఉద్యోగ అవకాశం కల్పించనున్నట్లు, అర్హత గల అభ్యర్థులు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పన అధికారి రవికృష్ణ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు 10వ తరగతి పూర్తి చేసి కనీసం 2సంవత్సరాల అనుభవం కలిగిన హెవీ మోటర్ వెహికల్ లైసెన్స్ కలిగి ఉండాలని, 24–40సంవత్సరాల వయసు ఉండాలని తెలిపారు. అభ్యర్థులు జర్మన్ భాషలో ఏ2 స్థాయి నైపుణ్యాన్ని సాధించాలని, నైపుణ్యాన్ని పొందేందుకు టామ్‌కామ్ సంపూర్ణ జర్మన్ భాషా శిక్షణ అందిస్తుందని తెలిపారు. ఎంపికైన అభ్యర్థులు ఆకర్షణీయమైన జీతం పొందడమే కాకుండా జర్మనీలో భద్రత, ప్రొఫెషనల్ వాతావరణంలో పనిచేసే అవకాశాన్ని పొందుతారని తెలిపారు. వివరాలకు 94400 52592, 81252 51408, 94400 49013, 94400 49645 నంబర్లలో సంప్రదించాలన్నారు.

బురదలో నిలబడి నిరసన



నిరసన తెలుపుతున్న కాలనీప్రజలు

భీమిని: కన్నెపల్లి మండల కేంద్రంలోని మాలీవాడలో ప్రజలు బురదలో నిలబడి గురువారం నిరసన తెలిపారు. సీసీ రోడ్డు వేసినా డ్రైయినేజీ నిర్మించకపోవడంతో రోడ్డుపై చెత్త పేరుకుపోయి దుర్గంధం వస్తోందని వాపోయారు. నడవడానికి కూడా ఇబ్బందిగా ఉందని ఆరోపించారు. సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వేడుకున్నారు.

కమాన్ ప్రారంభించిన జీఎం



ప్రారంభిస్తున్న ఏరియా జీఎం దేవేందర్

మందమర్రిరూరల్: మందమర్రి ,పట్టణంలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవాలయం సమీపంలోని రైల్వేస్టేషన్ రోడ్డు ప్రారంభంలో శ్రీ మద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి, లక్ష్మీనరసింహ స్వామి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సింగరేణి సహకారంతో ఏర్పాటు చేసిన కమాన్‌ను గురువారం ఏరియా జీఎం దేవేందర్ కమిటీ సభ్యులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజాసంక్షేమ కార్యక్రమాల విషయంలో సింగరేణి సంస్థ ముందుంటుందన్నారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, వర్క్‌షాప్ కార్మికులు, యూనియన్ ప్రతినిధులు, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

స్టేడియం ఏర్పాటుకు స్థలం పరిశీలన



స్థలం పరిశీలిస్తున్న జీఎం సూర్యనారాయణ

జైపూర్: మండలంలోని ఇందారం–టేకుమట్ల గ్రామాల మధ్యలో గల సింగరేణి ఖాళీ స్థలంలో మినీస్టేడియం ఏర్పాటుకు స్థలాన్ని శ్రీరాంపూర్ జీఎం సూర్యనారాయణ, ఐకే–ఓసీపీ పీవో ఏవీరెడ్డి గురువారం పరిశీలించారు. వారి తో పాటు ఐకే–ఓసీపీ రక్షణాధికారి సతీశ్, స్థా నిక నాయకులు సత్యనారాయణరావు, నర్స య్య, రమేశ్, సురేందర్ తదితరులు ఉన్నారు.

కార్మికుల పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందించాలి

శ్రీరాంపూర్: సింగరేణి కార్మికుల పిల్లల విదేశీవిద్య కోసం ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను అందించాలని సింగరేణి యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు సిద్దిక్‌షేక్ గురువారం ఒక ప్రకటనలో యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. సింగరేణి కార్మిక పిల్లలకు విదేశీ విద్య ఉద్యోగ అవకాశాలపై 'చమట చుక్క తర్ఫీదు' పథకాన్ని ప్రవేశపెట్టడాన్ని స్వాగతిస్తున్నామన్నారు. విదేశీ విద్యకు అర్హత సాధించేందుకు నిర్వహించే టోఫెల్, డూయోలింగో వంటి పరీక్షలకు కూడా కంపెనే కోచింగ్ సెంటర్ పెట్టి తర్ఫీదు ఇవ్వాలన్నారు. సీట్లు సాధించిన పిల్లలకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లు కంపెనీ అందించాలని డిమాండ్ చేశారు.

పరీక్షలు నిర్వహించాలి

శ్రీరాంపూర్: శ్రీరాంపూర్ సింగరేణిలో ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్(క్లర్క్) రాత పరీక్షలను వెంటనే నిర్వహించాలని గుర్తింపు సంఘం ఏఐటీయూసీ నాయకులు యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆ యూనియన్ డిప్యూటీ ప్రధాన కార్యదర్శులు వీరభద్రయ్య, సమ్మయ్య, బ్రాంచ్ కార్యదర్శి బాజీ సైదా, ఉపాధ్యక్షుడు కిషన్ రావు, సహాయ కార్యదర్శి కొమురయ్య, క్లరికల్ స్టాఫ్ ఇన్‌చార్జులు బద్రి బుచ్చయ్య, గొల్లపల్లి రాంచందర్ గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు. కంపెనీలో 360ఇంటర్నల్ జూనియర్ అసిస్టెంట్ ఖాళీల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చి దరఖాస్తులు స్వీకరించారన్నారు. కానీ నెలలు గడుస్తున్నా రాత పరీక్షలు నిర్వహించడంలేదన్నారు. యాజమాన్యం వెంటనే ఈ పరీక్షలు నిర్వహించి ఖాళీలు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.

■ బొగ్గుబాయి వార్తలు

ఐఎన్‌టీయూసీ ఏరియా సెక్రెటరీగా అనుదీప్



అనుదీప్

శ్రీరాంపూర్: ఐఎన్టీయూసీ శ్రీరాంపూర్ ఏరియా సెక్రెటరీగా ఎస్సార్పీ 3గనికి చెందిన అనుదీప్‌ను నియమించారు. జైపూర్ మండలంలోని రసూల్‌పల్లెలోని తన నివాసంలో యూనియన్ సెక్రెటరీ జనరల్ జనక్‌ప్రసాద్ నియామకపత్రాన్ని అనుదీప్‌కు అందించారు. శ్రీరాంపూర్ ఏరియాలో యూనియన్ బలోపేతం కోసం కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ బ్రాంచీ ఉపాధ్యక్షుడు శంకర్‌రావు, కేంద్ర కమిటీ ఉపాధ్యక్షులు కలవేన శ్యాం, డిప్యూటీ ప్రధాన కార్యదర్శి గరిగే స్వామి, నాయకులు తిరుపతిరాజు, జీవన్ జోయల్, భీంరవి, గోపాల్‌రెడ్డి, రౌతు సత్యనారాయణ పాల్గొన్నారు.

17న సీఎంపీఎఫ్ ట్రస్టీ సమావేశం

శ్రీరాంపూర్: బొగ్గు గని కార్మికుల కోల్ మైన్స్ ప్రావిడెంట్ ఫండ్(సీఎంపీఎఫ్) ట్రస్టీ బోర్డు సమావేశం ఈ నెల 17న జరగనుంది. ఈ మేరకు సీఎంపీఎఫ్ ఆర్గనైజేషన్ చైర్మన్ వీకే మిశ్రా ఇటీవల ఆదేశాలు జారీ చేశారు. ఈ సారి జరిగే 183వ బోర్డు సమావేశం హైదరాబాద్‌లో జరగనుంది. వేదిక, ఎజెండాను త్వరలో ప్రకటించనున్నారు.

కామన్‌డైట్ మెనూ అమలు చేయాలి

మంచిర్యాలఅర్బన్: జిల్లా వ్యాప్తంగా ఉన్న బీసీ వసతిగృహంలో కామన్ డైట్ మెనూ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మంచిర్యాల జిల్లా వెనకబడిన తరగతుల సంక్షేమాధికారి (బీసీడీవో) కార్యాలయంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ వినతిపత్రం అందజేశారు. కామన్ డైట్ మెనూ అమలు చేయకుండా నిర్లక్ష్యం చేస్తున్న వార్డెన్లు, సమయపాలన పాటించని వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు.

నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం

దండేపల్లి: నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు ఎంతో కీలకంగా పనిచేస్తాయని దండేపల్లి ఎస్సై ఉదయ్‌కిరణ్ అన్నారు. మండలంలోని మేదరిపేటలో స్థానిక వ్యాపారులతో గురువారం సమావేశం నిర్వహించి, సీసీ కెమెరాల ఏర్పాటుపై అవగాహన కల్పించారు.

మార్కెట్ నూతన కమిటీకి సన్మానం

జన్నారం: మండలంలోని పొనకల్ గ్రామ పంచాయతీ కార్యాలయంలో నూతనంగా నియామకమైన మార్కెట్ కమిటీ చైర్మన్ దుర్గం లక్ష్మీనారాయణ, వైస్ చైర్మన్ సయ్యద్ ఫసిఉల్లాతో పాటు మార్కెట్ కమిటీ డైరెక్టర్లుగా ఎన్నికైన రేగుంట ప్రదీప్, ఎల్లా లావణ్య, లకావత్ తిరుపతి, సోనేరావులను గురువారం అంబేడ్కర్ సంఘం మండల కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు.

సంక్షిప్త వార్తలు

ప్రమాద బీమాపై అవగాహన

మంచిర్యాలటౌన్: చాంబర్ ఆఫ్ కామర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఇండియా పోస్ట్, పోస్టల్ డిపార్టుమెంట్ వారి ప్రమాద బీమా పథకాలపై పోస్టల్ అసిస్టెంట్ మేనేజర్ రామారావు వ్యాపారస్తులకు గురువారం అవగాహన కల్పించారు.

యువత క్రీడల్లో రాణించాలి

కోటపల్లి: యువత చెడువ్యసనాలకు దూరంగా ఉంటూ క్రీడల్లో రాణించాలని ఎస్సై రాజేందర్ అన్నారు. వెంచపల్లిలో యూత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మండలస్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను గురువారం ఎస్సై రాజేందర్, ట్రైనీ ఎస్సై కోటేశ్ కలిసి ప్రారంభించారు.

యాసంగి వరినాట్లపై అవగాహన

భీమారం/నెన్నెల: భీమారం మండలంలోని పోలంపల్లిలో ఏవో సుధాకర్, ఏఈవో అరుణ్‌కుమార్ నెన్నెల మండలంలోని మన్నెగూడంలో మండల వ్యవసాయాధికారిణి సృజన, ఏఈఓ రాంచందర్, యాసంగి వరినాట్లపై రైతులకు గురువారం అవగాహన కల్పించారు. ఎరువుల యాజమాన్య పద్ధతుల గురించి రైతులకు వివరించారు.

రుచికరమైన ఆహారం అందించాలి

లక్సెట్టిపేట: విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలని మండల ప్రత్యేకాధికారి సంజీవరెడ్డి అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల కళాశాలను గురువారం సందర్శించారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని, విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించాలని సూచించారు.

ఇరుక్కుపోయిన ఇసుక లారీ

చెన్నూర్‌రూరల్: భూపాలపల్లి జిల్లా పూసుకుపల్లి నుంచి భైంసాకు వెళ్లే ఇసుక లారీ చెన్నూర్ మండలంలోని కొమ్మెర గ్రామం మీదుగా చెన్నూర్ వైపునకు వస్తుండగా బుధవారం రాత్రి ఎర్రగుంటపల్లిలో కల్వర్టుపై ఇరుక్కుపోయింది. దీంతో కల్వర్టు ధ్వంసం అయ్యింది.

అపార్ ఐడీ అప్డేట్ చేయాలి

కాసిపేట: ప్రతీ విద్యార్థి యొక్క అపార్ ఐడీ అప్డేట్ చేయాలని మండల విద్యాధికారి ముక్తేశ్వర వెంకటేశ్వరస్వామి సూచించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీలో ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల ఉపాధ్యాయులకు గురువారం సమావేశం నిర్వహించారు. అన్ని ప్రొఫైల్స్ అప్డేషన్‌లు, మధ్యాహ్న భోజనానికి సంబంధించి అటెండెన్స్ ప్రతీరోజు తెలంగాణ స్కూల్ ఎడ్యుకేషన్ యాప్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటిస్తూ, మధ్యాహ్న భోజనం నాణ్యతతో అందించాలన్నారు. సమావేశంలో మండల నోడల్ అధికారి రమేష్, స్కూల్‌కాంప్లెక్స్ హెచ్‌ఎం సుధాకర్, సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ప్రమాద బీమా చెక్కు అందజేత



చెక్కు అందజేస్తున్న దుర్గం చిన్నయ్య

వేమనపల్లి: మండలంలోని కొత్త కాలనీ గ్రామానికి చెందిన ముల్కల్ల శంకర్ ఇటీవల మృతి చెందగా ఆయన కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య రూ.2లక్షల ప్రమాద బీమా చెక్కు అందజేశారు. మృతుడు శంకర్ బీఆర్‌ఎస్ పార్టీ సభ్యత్వం పొంది ఉండటంతో ప్రమాద బీమా వర్తించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు కోలి వేణుమాధవ్, మాజీ సర్పంచ్‌లు పద్మ, మొండి, మాజీ ఎంపీటీసీ లక్ష్మణ్, సీనియర్ నాయకులు పర్వతాలు, బానయ్య, శ్రీశైలం, బానేష్ తదితరులు పాల్గొన్నారు.